సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024





నౌకాదళ సాహస విన్యాసాలు



సరిలేరు... మీకెవ్వరూ..

నింగిలో యుద్ధ విమానాలు.. నీటిలో నౌకల సమర శంఖారావం.. తీరంలో ఆసక్తిగా తిలకిస్తున్న విశాఖ జనం



బాణసంచా వెలుగులు

- మిలాన్–2024 పరేడ్‌లో అలరించిన సమర సామర్థ్య విన్యాసాలు
- జనసంద్రమైన ఆర్కే బీచ్
- ముఖ్య అతిథిగా హాజరైన రక్షణశాఖ సహాయ మంత్రి అజయ్‌భట్
- గౌరవ అతిథులుగా నేవీ చీఫ్ అడ్మిరల్ హరికుమార్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: సముద్రాన్ని చీల్చుకుంటూ దూసుకొచ్చిన హైస్పీడ్ బోట్లు.. వినీలాకాశంలో చక్కర్లు కొడుతూ దివి నుంచి సాగర జలాల్లోకి త్రివర్ణ పతాకంతో దిగివచ్చిన స్కై డైవర్లు.. శత్రు స్థావరాలపై మెరైన్ కమాండోల మెరుపు దాడులు.. గాలికంటే వేగంగా దూసుకొచ్చి బాంబుల వర్షం కురిపించిన యుద్ధ విమానాలు.. జెట్ స్పీడ్‌తో ఒడ్డుకు చేరుకున్న జెమినీ బోట్లు.. సముద్రంలో చిక్కుకున్న వారిని సాహసోపేతంగా రక్షించిన కమాండోలు.. ఒకటి కాదు.. రెండు కాదు.. కళ్లు చెదిరే విన్యాసాలతో ఆర్కేబీచ్ కదనరంగాన్ని తలపించింది. ప్రతిష్టాత్మక మిలాన్- 2024 వేడుకల్లో ముఖ్య భాగమైన ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ అద్భుతంగా సాగింది. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్, నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ పాల్గొన్న ఈ వేడుకలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. గురువారం సాయంత్రం 5 గంటలకు ముఖ్య అతిథులు వేదికపైకి చేరుకుని.. ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. తూర్పు తీరం ఎంతటి శత్రుదుర్భేద్యమో.. సుశిక్షితులైన సిబ్బంది తమ యుద్ధ విన్యాస ప్రదర్శనలతో చాటిచెప్పారు. ఇండియన్ నేవీతో పాటు 51 దేశాల నౌకాదళ, రక్షణదళ శక్తి సామర్థ్యాలను ప్రత్యక్షంగా వీక్షించే అదృష్టం నగర వాసులకు మరోసారి దక్కింది. ఈ అద్భుతమైన విన్యాసాలు భారత నౌకాదళ శక్తి, సామర్థ్యాలను చాటిచెప్పాయి.

విన్యాసాలు సాగాయిలా..

- ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఐదు హాక్ ఎయిర్‌క్రాఫ్ట్‌లపై కమాండోలు బాంబ్ పేలుడు, వ్యూహాత్మక విన్యాసాలతో కూడిన ఎయిర్ పవర్ ప్రదర్శన చేశారు. మూడు హాక్ విమానాలు 400 నాటికల్ మైళ్ల వేగంతో సాగర జలాలకు అతికొద్ది ఎత్తులో.. గాల్లో చక్కర్లు కొడుతూ అలరించాయి. రెండు హాక్ జెట్లపై కమాండోలు సముద్రానికి తక్కువ ఎత్తులో ఆధునిక వైమానిక పోరాటంలో ఉపయోగించే వ్యూహాలను ప్రదర్శించి అబ్బుర పరిచారు. మూడు భిన్నమైన హెలికాప్టర్లపై మూడు విభిన్న పద్ధతుల్లో సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షించే ప్రదర్శనలు అద్భుతంగా సాగాయి. సీహాక్స్ హెలికాప్టర్లు తొలిసారిగా విశాఖ ప్రజలను అలరించాయి. రోమియోలుగా చెప్పుకునే ఈ హెలికాప్టర్లు బాణసంచా వెలుగులతో కొత్త అనుభూతిని పంచాయి. పారా సెయిలింగ్ కోసం 8 వేల అడుగుల ఎత్తు నుంచి ఐదుగురు సాహస దళాలు పారాచూట్ సాయంతో దూకారు. గురుత్వాకర్షణ శక్తిని సైతం జయిస్తూ గాల్లో చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.
- పారాడోర్నియర్ పీకే బస్తోలా ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకంతో పాటు భారత నౌకాదళ పతకాన్ని చేతపట్టుకుని 8 వేల అడుగుల ఎత్తు నుంచి ఆక్సిజన్ మాస్క్ సాయంతో దూకారు. మెరైన్ కమాండో పారాచూట్ సాయంతో కిందికి దిగి.. ముఖ్య అతిథి రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్‌భట్‌కు జ్ఞాపిక అందించారు. భారత నౌకాదళానికి చెందిన అత్యంత వేగవంతమైన మిగ్–29కే యుద్ధ విమానాలు స్మాల్ షిప్స్ బాంబులు పేలుస్తూ సముద్ర జలాల్లో దూసుకుపోయాయి. గాల్లో చక్కర్లు కొడుతూ ఏరోడైనమిక్స్ విన్యాసాలతో అందర్నీ అలరించాయి. మూడు మిగ్ 29 యుద్ధ విమానాలు ఒక్కసారిగా దూసుకొచ్చి.. బాంబుల వర్షం కురిపించాయి. కమాండర్ బస్విందర్‌యాదవ్ నేతృత్వంలో జాతీయ పతాకాన్ని, నౌకాదళ పతాకాన్ని ఆవిష్కరించేలా.. నాలుగు చేతక్ హెలికాప్టర్లు తక్కువ ఎత్తులో ఎగురుతూ బ్యానర్ ఫార్మేషన్‌లో ఆకట్టుకున్నాయి. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన తేజస్ యుద్ధ విమానాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

విద్యుత్ దీపకాంతులతో మెరిసిన యుద్ధ నౌకలు

భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ జలశ్వా, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, ఐఎన్ఎస్ ముంబై, ఐఎన్ఎస్ విక్రాంత్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, ఐఎన్ఎస్ చెన్నై యుద్ధ నౌకలు విద్యుద్దీపాలంకరణలో మెరిసిపోయాయి. యుద్ధ విన్యాసాలను తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ తదితరులు వీక్షించారు.



కవాతులో పాల్గొన్న నావికులు

సిటీ పరేడ్ సాగిందిలా..

సాక్షి, విశాఖపట్నం: మిలాన్–2024 విన్యాసాలకు మరింత సొగసు తెచ్చేలా.. అంతర్జాతీయ సిటీ పరేడ్‌ను కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్‌భట్ ప్రారంభించారు. వివిధ దేశాలకు చెందిన నౌకాదళాలు, కోస్ట్‌గార్డ్ బృందాలు నిర్వహించిన కవాతు ఈ కార్యక్రమానికి హైలెట్‌గా నిలిచింది. రాష్ట్రానికి చెందిన కళలకు సిటీ పరేడ్‌లో పెద్దపీట వేశారు.

- 205 మంది విశాఖపట్నం నేవీ చిల్డ్రన్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు కలర్స్ ఆఫ్ లైఫ్ పేరుతో నృత్య ప్రదర్శనతో పరేడ్‌ను ప్రారంభించారు.
- యుద్ధనౌకల్లో ప్రదర్శించే హార్న్‌పైప్ డ్యాన్స్ ప్రదర్శన ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. 55 మంది సీ క్యాడెట్ కోర్ నృత్య ప్రదర్శనతో అదరగొట్టారు.
- కమాండర్ హైకమ్ బిక్ నాయకత్వంలో 51 దేశాల జాతీయ పతాకాలను ప్రదర్శిస్తూ నేవీ బ్యాండ్ ప్రదర్శన, మార్చ్‌పాస్ట్ అలరించింది.
- నేవీ బ్యాండ్ మాస్టర్ ఆంథోనీ రాజ్ నేవల్ బ్రాస్ బెండ్ ఉర్రూతలూగించింది.
- ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఇండియన్ కోస్ట్‌గార్డ్ దళాలు కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆర్మీ బ్యాండ్ అదరగొట్టింది.
- ఏపీ స్టేట్ పోలీస్ దళం, ప్రత్యేక పోలీసు బలగాలు, ఆక్టోపస్ బృందం, ఏపీ స్టేషన్ ఫైర్ సర్వీసెస్ బలగాలు మార్చ్‌పాస్ట్ చేశాయి.
- కోరుకొండ సైనిక్ స్కూల్ బృందం మిలటరీ బీట్‌తో, సీ క్యాడెట్ కోర్ తన బ్యాండ్‌తో ఉత్సాహాన్ని నింపాయి.
- రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే గరగలు డ్యాన్స్ విదేశీ ప్రతినిధులను ఆకట్టుకుంది.
- రాష్ట్ర నృత్యమైన కూచిపూడి, గిరిపుత్రుల మధ్య స్నేహ సౌభ్రాతృత్వాలు పెంపొందించే థింసా నృత్యం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.
- కొమ్ముకోయ గిరిజన నృత్య ప్రదర్శనకు విదేశీయులు ఫిదా అయ్యారు.
- దాండియా, గార్బా, డప్పు నృత్యం, పులివేషం, అమ్మవారి వేషాలు, కోలాటాలు, తప్పెటగుళ్ల తదితర ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి.
- పరేడ్ అనంతరం శకటాల ప్రదర్శన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిబింబించేలా ప్రదర్శించిన నవరత్నాల శకటం సిటీ పరేడ్‌కు హైలైట్‌గా మారింది.జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ చేపట్టిన ప్రాజెక్టులు, భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టుల నమూనాలు, సిటీ ఆఫ్ డెస్టినీ శకటాలు ఆకట్టుకున్నాయి.
- భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, నౌకాదళ శక్తి సామర్థ్యాలను చాటిచెప్పేలా ఏర్పాటు చేసిన లేజర్ షో అదరహో అనిపించింది.



విన్యాసాలను తిలకిస్తున్న నేవీ అధికారుల కుటుంబాలు



నేవీ హెలికాప్టర్ విన్యాసం



మహిళా విభాగం కవాతు





మిలాన్ కార్యక్రమంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు


న్యూస్‌రీల్

నారాయణ స్కూల్ బస్సు డ్రైవర్ నిర్వాకం

- తాగిన మైకంలో డ్రైవింగ్
- సకాలంలో గుర్తించిన పోలీసులు.. తప్పిన పెను ప్రమాదం

పాయకరావుపేట: నారాయణ స్కూల్ బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ తాగిన మైకంలో బస్సును అయోమయంగా నడుపుతున్న విషయాన్ని పోలీసులు గుర్తించి బాలలను రక్షించారు. పాయకరావుపేట ఏఎస్ఐ గోవిందరావు తెలిపిన వివరాలు.. తుని పట్టణానికి చెందిన నారాయణ స్కూలు బస్సు విద్యార్థులను తీసుకుని కోటనందూరు వెళుతోంది. జాతీయ రహదారి నుంచి తాండవ సుగర్ ఫ్యాక్టరీ మీదుగా వెళ్తున్న ఈ బస్సు డ్రైవర్ మద్యం సేవించాడు. తాగిన మైకంలో బస్సు నడుపుతుండగా.. ఆ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు ఆ విషయాన్ని గుర్తించారు. వెంటనే బస్సును నిలిపి డ్రైవర్ రెడ్డి రాజబాబుకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహించగా 201 ఎంజీ మద్యం సేవించినట్లుగా నిర్ధారణ అయింది. వెంటనే ఈ విషయాన్ని నారాయణ స్కూల్ యాజమాన్యానికి పోలీసులు తెలియజేశారు. ఈ బస్సులో ఉన్న విద్యార్థులను అదే పాఠశాలకు చెందిన వేరొక బస్సులో వారి వారి స్వగ్రామాలకు తరలించారు. డ్రైవర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏఎస్ఐ గోవిందరావు తెలిపారు.

కళాశాల అధ్యాపకులకు ఎంపవర్ బహుమతులు



బహుమతులను అందచేస్తున్న ప్రిన్సిపాల్

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు ఎంపవర్ బహుమతులు లభించాయి. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లుగా సేవలందిస్తున్న డాక్టర్ వి.రత్నభారతి, డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మలు ఆదిత్య బిర్లా సంస్థ మానసిక ఆరోగ్యంపై విశాఖలో నిర్వహించిన శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణ అనంతరం ప్రోగ్రామ్ ఆఫీసర్లకు బహుమతులు లభించాయి. వాటిని గురువారం ప్రిన్సిపాల్ రాధాకృష్ణ అందజేశారు.

ప్రగతి సూచిక.. రాజన్న వారధి



యలమంచిలిలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యే కన్నబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, సుకుమారవర్మ



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు, వేదికపై మంత్రి రాజా తదితరులు

- రూ.35 కోట్లతో నిర్మించిన ఆర్వోబీ ప్రారంభం.. నవశకానికి శ్రీకారం
- గత ప్రభుత్వాలు పట్టించుకోకపోయినా 15 ఏళ్ల తర్వాత పూర్తి చేశాం
- ఎమ్మెల్యే కన్నబాబురాజు కృషే ఇందుకు కారణం
- రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి దాడిశెట్టి రాజా

యలమంచిలి రూరల్/యలమంచిలి: చిరకాల స్వప్నం నెరవేరిన వేళ.. సంతోషం తాండవించిన తరుణాన.. యలమంచిలి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు.. ఈ వంతెనకు అనుమతి ఇచ్చిన మహా నేత పేరిట రాజన్న వారధిగా నామకరణం చేశారు.. పండగలా జరిగిన ప్రారంభోత్సవంలో ప్రజలు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. యలమంచిలి పట్టణంలో రైల్వే లెవెల్ క్రాసింగ్ 475–ఎ వద్ద రూ.35 కోట్లతో నిర్మించిన 1.2 కిలోమీటర్ల పొడవున్న ఫ్లైఓవర్ వంతెనకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా గురువారం ఎమ్మెల్యే యు.వి.కన్నబాబురాజుతో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమాలకు సమాన ప్రాధాన్యమిస్తున్నారని చెప్పడానికి ఈ వంతెన నిర్మాణమే నిదర్శనమన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన వంతెన పనులను ఎమ్మెల్యే కన్నబాబు తప్ప ఇంకెవరున్నా పూర్తి చేయించలేరన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పట్టుబట్టి మూలకు చేరిన ఫైళ్లను మళ్లీ అధికారుల దృష్టికి తేవడానికి ఎన్నోసార్లు తనతో మాట్లాడారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అసంపూర్తిగా వదిలిపెట్టిన ఫ్లైఓవర్‌ను ప్రజలకు ఉపయోగపడేలా వినియోగంలోకి తేవడం తనకు కూడా ఆనందంగా ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొందరు సీనియర్లు సీఎస్సార్ నిధులను తమ స్వంత ట్రస్టుల ఖాతాల్లో జమ చేసుకుని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కానీ యలమంచిలి నియోజకవర్గంలో సీఎస్సార్ నిధులను నియోజకవర్గం అభివృద్ధికి ఖర్చు పెట్టేలా కృషి చేసిన ఎమ్మెల్యే కన్నబాబురాజుపై తనకు మరింత గౌరవం పెరిగిందన్నారు.

తండ్రీ తనయులదే ఈ ఘనత: కన్నబాబురాజు

ఉమ్మడి రాష్ట్రంలో 2009లో ప్రారంభమైన ఫ్లైఓవర్ వంతెన పనులు 2014 వరకు కొనసాగాయని, అప్పట్లోనే 70 శాతం పూర్తయిన పనులను టీడీపీ ప్రభుత్వం పూర్తి చేయలేదని ఎమ్మెల్యే కన్నబాబు చెప్పారు. తిరిగి 2019లో తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వంతెన పనులపై దృష్టి పెట్టానన్నారు. కాంట్రాక్టరు రూ.2 కోట్ల బిల్లు పెండింగ్‌లో ఉందని చెప్పడంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కలిసి బిల్లు మంజూరు చేయించానన్నారు. బిల్లు మంజూరైన తర్వాత ఆ కాంట్రాక్టరు స్పందించకపోవడంతో కథ మళ్లీ మొదటికొచ్చిందన్నారు. సాంకేతికంగా టెండర్ల ప్రక్రియ నిర్వహించి, వంతెన పనులు పూర్తి చేయించడానికి ఏడాదిన్నర సమయం పట్టిందన్నారు. ఈ వంతెన పనులకు దివంగత మహానేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు శ్రీకారం చుట్టినందున ఆయన జ్ఞాపకార్థం వంతెనకు రాజన్న వారధిగా నామకరణం చేశామన్నారు. ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడే ఈ వంతెన నిర్మించిన ఘనత తండ్రీ తనయులు రాజన్న, జగనన్నలదేనన్నారు. ఈనెల 29 నుంచి వంతెనపై వాహనాల రాకపోకలను అనుమతిస్తామన్నారు. పట్టణ రూపురేఖలు మార్చడానికి చేస్తున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యే కన్నబాబు ఆర్ అండ్ బీ అధికారులను సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, వైస్ ఎంపీపీ రాజాన శేషు, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, రాంబిల్లి జెడ్పీటీసీ ధూళి నాగరాజు, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ కె.కాంతిమతి, అనకాపల్లి ఈఈ ఎస్.ఆర్.ఎన్.వి.రమేష్, యలమంచిలి డీఈఈ ఆర్.ఆర్.విద్యాసాగర్, ఏఈఈ ఎం.సత్యవాణి, ఎలక్ట్రికల్ ఈఈ సి.సతీష్, ఎలక్ట్రికల్ డీఈఈ కె.కిషోర్‌బాబు, ఏఈఈ సిహెచ్.రాజ్యలక్ష్మి, నాలుగు మండలాల ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విశాఖకు గొల్ల బాబూరావు

- రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యాక తొలిసారి విశాఖకు..
- ఎయిర్‌పోర్టులో స్వాగతం పలకనున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సాక్షి, విశాఖపట్నం : రాజ్యసభ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన గొల్ల బాబూరావు శుక్రవారం విశాఖకు రానున్నారు. ఉదయం 8.30 గంటలకు విమానాశ్రయానికి చేరుకోనున్న ఆయనకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలకనున్నాయి. ఎయిర్‌పోర్టు నుంచి వందలాది బైక్‌లు, కార్లతో ర్యాలీగా వెళ్లి డాబాగార్డెన్స్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి ఆయన నివాళులర్పించనున్నారు. అక్కడ నుంచి బీచ్‌రోడ్డుకు చేరుకొని అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. తరువాత ఎండాడలో గల పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. ఈ మేరకు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో గల వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, కార్పొరేటర్లు హాజరుకావాలని ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్‌నాథ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పిలుపునిచ్చారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

- జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర
- 6 లక్షల దోమ తెరలకు ప్రభుత్వానికి ప్రతిపాదన
- దేవరాపల్లి పీహెచ్‌సీని సందర్శించిన డీఎంవో



దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్య మేఘనను ఆరా తీస్తున్న డీఎంవో వరహాలుదొర

దేవరాపల్లి : జిల్లాలో మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా అధికారి కె.వరహాలుదొర అన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 14 మలేరియా కేసులు, 24 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని ఆయన తెలిపారు. ఈ మేరకు దేవరాపల్లి పీహెచ్‌సీని గురువారం ఆయన సందర్శించి పీహెచ్‌సీలో మలేరియా కేసుల పరిస్థితిపై వైద్యాధికారి ఇ.పూజ్య మేఘనను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం ద్వారా లార్వా వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఎన్ఎంలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. మలేరియా, డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతం చుట్టూ 50 ఇళ్లలో దోమల మందు పిచికారీ చేస్తున్నామన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తపడటం ద్వారా దోమలు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. దోమ కాటుకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కిటికీలు, సెప్టిక్ ట్యాంకుల పైపులకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 6 లక్షల దోమ తెరలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, ప్రభుత్వం సరఫరా చేసిన వెంటనే గతంలో మలేరియా కేసులు నమోదైన ప్రాంతాల ప్రజలకు అందజేస్తామని స్పష్టం చేశారు. ఈయన వెంట మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్.వి.రమణ, స్థానిక హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్ తదితరులు ఉన్నారు.



పూడిమడక తీరం

తీరంలో మాఘపౌర్ణమి సందడి

మాఘపౌర్ణమి సందర్భంగా అచ్యుతాపురం మండలంలోని పూడిమడక, ఎస్.రాయవరం మండలంలోని రేవు పోలవరం, రాంబిల్లి మండలంలోని వాడపాలెం సముద్ర తీరాల్లో జాతర జరగనుంది. ఈ సందర్భంఆ పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల కోసం అధికారులు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. ఈ సందర్భంగా పూడిమడకలోని జగన్నాథస్వామి ఆలయం, రేవు పోలవరంలోని లక్ష్మీ మాధవస్వామి ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. పూడిమడకలో విద్యుదలంకరణ ఆకట్టుకుంటుంది.

IIలో



జగన్నాథస్వామి



విద్యుదలంకరణ

క్లుప్తంగా

ఒకే యూనిఫారంలో వలంటీర్లు



తేగాడ సచివాలయ గ్రామ వలంటీర్లను అభినందిస్తున్న పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు

కశింకోట: మండలంలోని తేగాడ సచివాలయానికి చెందిన గ్రామ వలంటీర్లు ఒకే యూనిఫారం ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కశింకోటలో గురువారం నిర్వహించిన ×వలంటీర్లకు వందనం¥ అభినందన కార్యక్రమానికి తేగాడ సచివాలయ పరిధిలో ఉన్న తేగాడ, పేరంటాలపాలెం గ్రామాలకు చెందిన వలంటీర్లు ఒకే రకమైన యూనిఫారం ధరించి హాజరయ్యారు. ఒకే రకమైన వస్త్రధారణ వల్ల గ్రామస్తులు తమను సులువుగా గుర్తించేందుకు వీలుంటుందని ఒకే యూనిఫారం కొనుగోలు చేసుకున్నట్లు వలంటీర్లు తెలిపారు. వీరు సేవా మిత్ర పురస్కారాలు అందుకున్నారు. వీరిని సచివాలయ కార్యదర్శి కె.నాగేశ్వరరావు, పేరంటాలపాలెం ఉప సర్పంచ్ వజ్రం శ్రీను తదితరులు అభినందించారు.

చిత్రలేఖనంలో బంగారు పతకం



చిత్రలేఖనంలో బంగారు పతకం సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కోటవురట్ల : జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలో గ్రామీణ విద్యార్థులు మెరిసారు. చిత్రాలతో అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 18న విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలో కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్, ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ సంయుక్తంగా పోటీలు నిర్వహించగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. అందులో వెంకటాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు యోధ కార్తీక్, శివరామ తేజ, చందన, దేవి, అపర్ణ, సింహాద్రి, ఆర్.తేజ, శ్రీదేవి, సుకన్య, రక్షిత, తేజ ప్రధమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. వీరికి గోల్డ్ మెడల్‌తో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన డ్రాయింగ్ టీచర్ కృష్ణకు మెమెంటో అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం షేక్ అల్లావుద్దీన్, ఉపాధ్యాయులు విజేతలను, టీచర్ కృష్ణను ఘనంగా సత్కరించారు.

తీరంలో మాఘపౌర్ణమి సందడి



పూడిమడక జగన్నాథ స్వామి ఆలయం

- పుణ్యస్నానాలకు లక్షలాది మంది భక్తులు వస్తారని అంచనా
- పూడిమడక, రేవు పోలవరం, వాడపాలెం తీరాల్లో విస్తృత ఏర్పాట్లు



రేవుపోలవరంలో వెలసిన లక్ష్మీమాధవ స్వామి



మాఘపౌర్ణమి జాతరకు ముస్తాబైన లక్ష్మీమాధవ స్వామి ఆలయం



రాంబిల్లి బీచ్ వద్ద పర్యాటకులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అందాల సహజ తీరం పూడిమడక ఒడ్డున మాఘ పౌర్ణమి వేడుకలకు ముస్తాబయ్యింది. సుమారు లక్షకు పైగా సందర్శకులు రానుండడంతో వివిధ శాఖల సమన్వయంతో స్నానపు ఘాట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం రాత్రి సముద్రపు తీరాన జాతరలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. బాణాసంచా విన్యాసాలు నిర్వహించనున్నారు. వారం రోజుల నుంచి జగన్నాథస్వామి ఆలయంలో పూజలు ప్రారంభం అయ్యాయి. పూడిమడక ప్రధాన రహదారుల్లో విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి వరకూ జాతరను ఆస్వాదించనున్న గ్రామస్తులు, సందర్శకులు రాత్రి అంతా జాగారం ఉంటారు. శనివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ పౌర్ణమి స్నానాలు ఆచరించనున్నారు. జాతర ప్రాంతానికి వాహనాలు వెళ్లకుండా ట్రాఫిక్ ఆంక్షలు, మెరైన్ పోలీసుల బందోబస్తు నిర్వహిస్తున్నారు. అనకాపల్లి నుంచి పూడిమడక వరకూ ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను నడపనున్నారు. అచ్యుతాపురం జంక్షన్ దాటిన తర్వాత ప్రైవేట్ వాహనాలను నియంత్రించనున్నారు. పూడిమడక హైస్కూల్ జంక్షన్ నుంచి ద్విచక్ర వాహనాలను సైతం నిలిపివేసి కాలినడకనే సందర్శకులు వెళ్లాల్సి ఉంది. పూడిమడక హైస్కూల్ జంక్షన్ తర్వాత వాహనాలను అనుమతించే అవకాశం లేదని సీఐ బుచ్చిరాజు తెలిపారు.

తీరం వద్ద ఏర్పాట్లు

పూడిమడక స్నానానికి విచ్చేసే ప్రజలకు తీరం వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. మొబైల్ బాత్‌రూంలు, దుస్తులు మార్చుకొనే షెల్టర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. తీరం వద్ద స్నానం చేస్తూ లోపలికి వెళ్లకుండా నియంత్రించేందుకు స్థానిక మత్స్యకార యువకుల సహకారంతో పాటు, స్కాట్, వలంటీర్ల సహకారం తీసుకోనున్నారు. సర్పంచ్ చేపల వెంకట రమణ ఆధ్వర్యంలో గ్రామంలో విద్యుత్ సెట్టింగ్‌లతో పూడిమడక తీరం సందడిగా మారింది.

రేవు పోలవరంలో...

ఎస్.రాయవరం : రేవుపోలవరం తీరంలో శనివారం తెల్లవారుజాము నుంచి జాము నుంచి జరిగే మాఘపౌర్ణమి పుణ్యస్నానాలకు తీరం ముస్తాబైంది. ప్రతి ఏడాది మాఘపౌర్ణమి సందర్భంగా లక్షకు పైగా భక్తులు వచ్చి పుణ్య స్నానాలు ఆచరిస్తారని అంచనా. ఇందుకోసం సందర్శకుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు దర్శనం కల్పించేందుకు లక్ష్మీమాధవ స్వామి కూడా ఆలయానికి నూతన రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు. శుక్రవారం రాత్రి నుంచి రేవుపోలవరం, కొత్తరేవు పోలవరంలో జాతర సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. జాతర భక్తులను తరలించేందుకు నర్సీపట్నం డిపో నుంచి అడ్డురోడ్డు జాతీయ రహదారి నుంచి రేవు పోలవరం తీరం వరకు ప్రత్యేక బస్సులు నడుపుతారు. ఎస్.రాయవరం పోలీసు వారు ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తారు. సత్యసాయి స్వచ్ఛంద సంస్థవారు, సేవా సంఘాలు వారు భక్తులకు సౌకర్యాలు అందించనున్నారు.

వాడపాలెంలో గంగాదేవి జాతర

రాంబిల్లి: రాంబిల్లి శివారు వాడపాలెం తీరాన్ని రాంబిల్లి బీచ్‌గా పిలుస్తారు. ఏటా ఇక్కడ మాఘ పౌర్ణమి రోజున గంగాదేవి జాతర నిర్వహిస్తారు. ఈ ఏడాది శనివారం ఇక్కడ జాతర నిర్వహించనున్నారు. శుక్రవారం రాత్రి నుంచే జాతర ప్రారంభం కానుంది. పలు ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడకు తరలి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించి గంగాదేవికి పూజలు చేస్తారు. రాంబిల్లి తీరంలో ఇసుక తెన్నెలు, అలల తాకిడికి శిల్పులు చెక్కిన విధంగా వుండే రాళ్లు ఆకర్షణగా నిలుస్తాయి.

రోడ్లుకిరువైపులా పచ్చదనంతో ఆహ్లాదం



రోడ్డుకు ఇరువైపులా పెంచుతున్న మొక్కలను పరిశీలిస్తున్న సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో లక్ష్మణ్

కె.కోటపాడు : రోడ్లుకిరువైపులా పెంచుతున్న మొక్కలతో పచ్చదనం పెంపొందించి పర్యావరణ రక్షణను చేపట్టగలమని అనకాపల్లి జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో జి.లక్ష్మణ్ అన్నారు. కె.కోటపాడు మండలంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సూచనల మేరకు కొత్తగా నిర్మాణం చేసిన తారురోడ్లుకిరువైపులా నాటిన మొక్కలను గురువారం ఆయన పరిశీలించారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలంలో పలు గ్రామాల మధ్య రోడ్ల కిరువైపులా మొక్కలను నాటినట్టు ఆయన తెలిపారు. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా ఎన్‌టీపీసీ నిధులతో 50 వేల తెల్లమద్ది, బాదం, కాను, పెల్టోఫారం, చీమరుబ, పనస, దేవకాంచన రకం మొక్కలను 50 కిలోమీటర్లు రోడ్లుకిరువైపులా నాటడంతో పాటు మరో 40 వేల మొక్కలను బ్లాక్ ప్లాంటేషన్‌లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ, ఏపీఐఐసీ ఇండస్ట్రీ భూముల్లోను, మార్కెట్ యార్డ్‌ల వద్ద నాటినట్టు డీఎఫ్‌వో తెలిపారు. ఆయన వెంట సోషల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి చంద్రశేఖర్, డిప్యూటీ రేంజ్ అధికారి విజయ్‌కుమార్, వనసేవకుడు చిరికి గోవింద పాల్గొన్నారు.

చంద్రబాబుకు ప్రజలే వీఆర్ఎస్ ఇస్తారు..

- బాబు సేవలు రాష్ట్రానికి అవసరం లేదు
- రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు



నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు

నక్కపల్లి : చంద్రబాబునాయుడు ముందు ఇంట గెలిచి రచ్చగెలవాలని, ఆయన సతీమణి చెప్పినట్టు వీఆర్‌ఎస్ తీసుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలే మళ్లీ సాగనంపేస్తారని పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం ఆయన నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయరని, ఆయనకు విశ్రాంతి ఇచ్చి తానే కుప్పం నుంచి పోటీ చేస్తానని నారా భువనేశ్వరి ప్రకటించడం బట్టి చూస్తే చంద్రబాబు ఇంక రాజకీయాలకు, ముఖ్యమంత్రి పదవికి పనికిరాడని అర్థం అవుతోందన్నారు. ప్రజలు ఐదేళ్ల క్రితమే చంద్రబాబు సేవలు రాష్ట్రానికి అవసరం లేదని చెబుతూ 23 సీట్లకే పరిమితం చేసి సాగనంపేసారన్నారు. తగుదునమ్మా అని పొత్తుల కోసం వెంపర్లాడకుండా ఆయన స్వచ్ఛందంగా రాజకీయాల నుంచి తప్పుకుంటే మంచిదన్నారు. చంద్రబాబు ఔట్‌డేటెడ్ నాయకుడైతే జగనన్న అప్‌డేటెడ్ రాజకీయ నాయకుడన్నారు. సీఎం జగన్ ప్రజలకు ఏం కావాలో, భావితరాల భవిష్యత్‌కు ఏం చేస్తే బాగుటుందో ముందు చూపుతో వ్యవహరించి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. జగనన్న ప్రవేశ పెట్టిన ప్రతి పథకం భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని చేస్తున్నవేనన్నారు. వచ్చే ఎన్నికల్లో రెండోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు రాష్ట్ర ప్రజలు కంకణం కట్టుకున్నారన్నారు. దీంట్లో ఎటువంటి సందేహం లేదన్నారు. సమావేశంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, పాల్గొన్నారు.

ఎన్నికలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిద్దాం

- డీఎస్పీ వెంకట రామయ్య



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరామయ్య

నర్సీపట్నం : సబ్ డివిజన్‌లో ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పోలీసు సిబ్బంది బాధ్యతగా పని చేయాలని డీఎస్పీ బి.వెంకటరామయ్య పేర్కొన్నారు. ఎన్నికల విధులపై గురువారం పోలీసు సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ఎన్నికల నియమావళిని తుచ తప్పకుండా అమలు చేయాలన్నారు. ప్రతి ఒక్క ఓటరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రశాంత వాతావరణ ఉండేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోపణలు రాకుండా ఎన్నికల విధుల పైనే దృష్టి సారించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు రూ.10 లక్షల లోపు నగదు ఉంటే సీజ్ చేయవద్దన్నారు. నోటిఫికేషన్ వెలువడిన మరుక్షణం నుంచి రూ.50 లక్షలకు మించి ఎవరు నగదు తీసుకెళ్లినా సీజ్ చేయాలని సూచించారు. ఎన్నికల కోడ్‌ను పక్షపాతం లేకుండా అమలు చేయాలన్నారు. ఈ సదస్సులో నర్సీపట్నం, నక్కపల్లి, పాయకరావుపేట సీఐలు కాంతికుమార్, హరి, అప్పన్న, రమేష్, ఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంచడమే లక్ష్యం

- ఎ.కొత్తపల్లి హైస్కూల్‌ను సందర్శించిన లిప్ టీమ్ సభ్యులు



ఎ.కొత్తపల్లిలో హెచ్‌ఎం స్వర్ణలతను ఆరా తీస్తున్న లిప్ టీమ్ సభ్యులు

దేవరాపల్లి : విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంపొందించడమే అభ్యసనాభివృద్ధి కార్యక్రమం (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర లిప్ టీమ్ సభ్యులు అన్నారు. మండలంలోని ఎ. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నలుగురు సభ్యులతో కూడిన రాష్ట్ర లిప్ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) బృందం గురువారం ఆకస్మికంగా సందర్శించింది. శ్రీకాకుళం డైట్ ప్రిన్సిపాల్ ఎం.భారతి, భీమిలి డైట్ ప్రిన్సిపాల్ ఎస్.త్రినాథరావు, విజయనగరం ఎస్. రాంబాబు, జి. రామనాథం లిప్ టీమ్ సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా 6వ, 7వ, 8వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసనాభివృద్ధిపై ఆరా తీశారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు ఎలా విద్యాబోధన చేపడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధనలో పాటించాల్సిన మెళకువలను ఉపాధ్యాయులకు సూచించారు. విద్యాపరంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయి ఆధారంగా విద్యాబోధన చేపట్టాలన్నారు. వీరి వెంట మండల విద్యాశాఖ అధికారి-1 బి.పడాల్‌దాస్, స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వై. స్వర్ణలత, సీఆర్‌ఎంటీ గంగాధర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

గొలుగొండ: మండలంలో ఏటిగైరంపేట గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో కొయ్యూరు మండలానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం గుమ్మిడివానిపాలేనికి చెందిన కె. సంజీవరావు, మోపెడ్ బైక్‌పై ఏటిగైరంపేట వస్తున్న సమయంలో నర్సీపట్నం నుంచి చింతపల్లి వెళుతున్న ఆర్టీసీ బస్సు సంజీవరావు మోపెడ్‌ను ఏటిగైరంపేట వద్ద ఢీకొట్టింది.

దీంతో సంజీవరావు తలకు బలమైన గాయం తగిలి అక్కడకక్కడే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు. ఈ దుర్ఘటనపై గొలుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి



సంఘటన స్థలంలో గాయాలతో ఆనందరావు (ఇన్‌సెట్) మృతుడు ఆనందరావు(ఫైల్)

బుచ్చెయ్యపేట : తురకలపూడికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ వేపాడ ఆనందరావు (40) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తురకలపూడికి చెందిన ఆనందరావు తూర్పు గోదావరి జిల్లా రాజోలు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతని కుటుంబం తురకలపూడిలోనే నివాసం ఉండగా ఆనందరావు రాజోలులో స్థానికంగా ఉంటూ నెలకొకసారి తురకలపూడి పిల్లలు వద్దకు వస్తూ విధులకు వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం తురకలపూడిలో గ్రామదేవత పండగ సందర్భంగా సోమవారం రాజోలు నుంచి వచ్చాడు. మంగళవారం కుటుంబ సభ్యులతో సంతోషంగా పండగ జరుపుకొన్నారు. బుధవారం పీపీ అగ్రహారం శివారు గొర్లెపాలెంలో నివాసం ఉంటున్న తన బావమరిది రామునాయుడు భార్య రాజేశ్వరిని పలకరించడానికి వెళ్లాడు. సాయంత్రం గొర్లెపాలెం నుంచి తురకలపూడికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా గొంప జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. తలకు గాయమైన ఇతన్ని స్థానికులు, కుటుంబ సభ్యులు రావికమతం ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గురువారం ఉదయం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆనందరావు మృతి చెందాడు. ఆనందరావు తల్లి గతంలోనే మృతి చెందగా వృద్ధాప్యంలో ఉన్న తండ్రి బాపూజీ, భార్య భవాని నాలుగు, రెండోవ తరగతి చదువున్న ఇద్దరు కుమార్తెలు కీర్తన, జాన్వీలున్నారు. శుక్రవారం ఖాకీ బట్టలు ధరించి ఆర్టీసీలో విధులకు వెళ్లాల్సిన తన భర్త తెల్లటి వస్త్రంతో చాపకు చుట్టి శవమై ఇంటికి రావడంతో మృతుడి భార్య భవాని భోరున విలపించింది. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును తీసుకుపోయావా దేవుడా మేం ఏం పాపం చేశాం రేపటి నుండి ఎలా బతకాలి దేవుడా అంటూ పిల్లల్ని పట్టుకుని భోరున విలపించడంతో కుటుంబ సభ్యులు స్థానికులు కన్నీరుపెట్టుకున్నారు. మృతుడి భార్య భవానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రావికమతం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఆనందరావు మృతదేహానికి శవ పంచనామా చేసి కుటుంబ సభ్యులకు పోలీసులు అందజేశారు. దీంతో వారు అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ గంట్ల అప్పలనాయుడు, కోఆపరేటివ్ అధ్యక్షుడు బుదిరెడ్డి నాగభూషణం, గ్రామ నాయకులు వెంకునాయుడు తదితరులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టిప్పర్ డ్రైవర్‌కు గాయాలు

రాంబిల్లి: జంగాలపాలెం సమీపంలో గురువారం జరిగిన ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ గాయపడ్డాడు. ఆగి వున్న టిప్పర్‌ను వెనుక నుంచి మరో టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక వున్న టిప్పర్ డ్రైవర్ కాళ్లకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు నెలల క్రితం గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం



మహిళ మృతదేహం వద్ద అధికారులు, కుటుంబ సభ్యులు

అనంతగిరి : మూడు నెలల క్రితం లువ్వాగెడ్డలో గల్లంతైన మిరియాల కమల మృతదేహం రెండు రాళ్ల మధ్య గురువారం బయటపడింది. మండలంలోని భీంపోల్ పంచాయతీ సమీపంలో లువ్వాగెడ్డను దాటుతుండగా సీతపాడు గ్రామానికి చెందిన గెమ్మెల లక్ష్మి, గెమ్మెల కుమార్, మిరియాల కమల ఈ ముగ్గురు గిరిజనులు మూడు నెలల క్రితం గల్లంతైన విషయం తెలిసిందే. లక్ష్మి, కుమార్‌ల మృతదేహాలు లభ్యం కాగా, మిరియాల కమల ఆచూకీ లభ్యం కాలేదు. అప్పుడు నాలుగు రోజుల పాటుగా ఏపీఎస్‌డీఆర్ బృందాలు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. గురువారం లువ్వా సమీపంలో గల కొత్తవలస గ్రామ గిరిజనులు చేపలు పట్టేందుకు గెడ్డకు వెళ్లగా రెండు రాళ్ల మధ్యలో మహిళ మృతదేహం కనిపించింది. దీంతో అధికారులకు సమాచారం అందించారు. తహసీల్దార్ నరసింహమూర్తి, ఎస్ఐ కరక రాము అక్కడికి చేరుకున్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో అది మూడు నెలల క్రితం గల్లంతైన మిరియాల కమలగా నిర్ధారించారు. మృతదేహం నీటిలో ఉండడంతో పూర్తిగా పాడైంది. వైద్యాధికారి సమక్షంలో అక్కడే శవపంచనామా చేసి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎంపీటీసీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రజా పరిషత్, నర్సీపట్నం

వేలం ప్రకటన

అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం మండల ప్రజా పరిషత్ అధీనంలో నిర్వహించుచున్న వేములపూడి వారపు సంత యందు 2024-25 సంవత్సరమునకు ఆశీలు వసూలు చేసుకొనే హక్కును కల్పించుటకు తే. 29.02.2024ది గురువారం ఉదయం గం॥ 11.00 లకు మరియు ఇందిరా మార్కెట్ నర్సీపట్నం నందు రోజువారి మరియు వారపు సంత యందు 2024-25 సంవత్సరమునకు ఆశీలు వసూలు చేసుకొనే హక్కును కల్పించుటకు తే. 28.02.2024ది బుధవారం ఉదయం గం॥ 11.00 లకు మండల ప్రజాపరిషత్, నర్సీపట్నం సమావేశ మందిరము నందు బహిరంగ వేలం నిర్వహించబడును. సదరు వేలం నందు పాల్గొనువారు వేలం తేదికి ముందు రోజు నియమిత అధికారికి దిగువ పత్రములు అందజేయవలెను.

1. మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల ప్రజా పరిషత్, నర్సీపట్నం వారి పేరున స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, నర్సీపట్నంలో చెల్లుబాటు అగునట్లు నర్సీపట్నం సంతపాట దారులు రూ. 2,00,000/- (అక్షరములా రెండు లక్షల రూపాయలు మాత్రమే) మరియు వేములపూడి వారపు సంత పాటదారులు రూ. 2,00,000/- (అక్షరముల రెండు లక్షల రూపాయలు మాత్రమే) విలువ గల బ్యాంకు డ్రాఫ్టులు మాత్రమే ధరావత్తు నిమిత్తం చెల్లించవలెను.
2. తహశీల్దారు హోదాకు తక్కువ కాని అధికారి నుండి తే. 01.02.2024ది మరియు పిదప పొందిన రూ. 2,00,000/-ల మోతుబరి ధృవపత్రం నర్సీపట్నం సంత వేలం పాటకు పాడు వారు ఒరిజినల్ ధృవపత్రములు (సాల్వెన్సీ) దాఖలు చేయవలెను. మరియు రూ. 2,00,000/-ల మోతుబరి ధృవపత్రం వేములపూడి సంత వేలం పాటకు పాడు వారు ఒరిజినల్ ధృవపత్రములు (సాల్వెన్సీ) దాఖలు చేయవలెను. పాటదారుని ఆధార్ కార్డు ఒరిజినల్ విధిగా ధాఖలు చేయవలెను. సదరు (సాల్వెన్సు) ఆస్తి యొక్క ఇ.సి. జత పర్చవలెను.
3. సదరు వేలం పాటను ఏ కారణం చేతనైనను, రద్దు చేయు అధికారము ఈ దిగువ సంతకందారునికి కలదు. వేలం మరియు సంత షరతులు వగైరా వివరములకు కార్యాలయం పనిచేయు వేళలో పొందవచ్చును.
4. వేలం పాట ఖాయపర్చిన నగదుకు 18% సర్వీసు ట్యాక్సు అదనముగా చెల్లించవలయును.

సంప్రదించు సెల్ : 9849900151, 9052741584

మండల పరిషత్ అభివృద్ధి అధికారి
మండల ప్రజా పరిషత్, నర్సీపట్నం.

File No.FCS02-COOR/1/2024-JA1-CSANKP

Rc.No.22 /2024/SA-2 (Elections),Dated: 21/02/2024 Collector's Office, Anakapalli.

Tender Notice

Sealed tenders are invited from the Printers for Printed Stationery items listed as per the "A-List" specifically for the use at Polling Stations for the ensuing General Elections to HoP / APLA -2024. Detailed list of items for supply as shown in the attachment. Interested Printers are requested to file sealed tender in Collector's Office, Anakapalli during office hours on or before **01-03-2024.**

Requirement of PRINTED Stationery items listed as per the "A-List" below for the ensuing General Elections to HOP / APLA -2024 in the Anakapalli district.

(A) List of Printing material required each Polling Station (to be ordered for printing as applicable)

Sl. No.	Items	Quantity for PS as per the RO Hand Book-2023
1	**Forms:** Booklet - 06 - Blue Colour Booklet	
	i. List of contesting candidates Form -7A	1 No. Booklet
	ii. Photo copy of signature of Candidates /Agents	1 No. Booklet
2	Distinguishing mark rubber stamp	1 No.
3	Mock Poll Slip Stamp	1 No.
4	Instructions of Electronic Voting Machine & VVPAT	1 No.
5	Poster on How to cast vote on EVM &VVPAT	1 No.
6	Brochure for Presiding Officer on use of EVM & VVPAT	1 No.
7	Trouble shooting on use of EVM & VVPAT (Annexure-22)	1 No.
8	Mock Poll leaflet	1 No.
9	Commission order of identification of electors through alternative documents	1 No.
10	Phone Books Contact Book for Polling parties	1 No.
11	(Printing) items to be kept in Plastic Box	
c)	Sign Boards	1 No.
	(i) Presiding Officer	1 No.
	(ii) Polling officer-1	1 No.
	(iii) Polling Officer-2	1 No.
	(iv) Polling Officer-3	1 No.
	(v) Polling Officer-4	1 No.
	(vi) Polling Officer-5	1 No.
	(vii) Entry	1 No.
	(viii) Exit	1 No.
	(ix) Male	1 No.
	(x) Female	1 No.
	(xi) Polling Agent	1 No.
	(xii) You are under WEB CASTING/ CCTV surveillance	4 Nos.
	(xii) Miscellaneous notice specifying area, etc as required by under Rule 31(1)(a) of The Conduct of Elections Rules 1961	1 No.

Terms and conditions:

1. They should deposit Rs.10,000/- as EMD in the shape of Demand Draft in favour of the Collector & District Election Officer, Anakapalli.
2. The items shall be delivered within (7) days from the date of issue of purchase order as per the specifications mentioned above. Separate instructions will be issued for delivery of items.
3. The Election Authority has every right to cancel the order, if the material is not-supplied within time.
4. The amount will be made against delivery.

KVLN Murthy
Nodal Officer and District Civil Supply Officer,
Anakapalli

క్లుప్తంగా

నేడు 'ఆరోగ్య సురక్ష' శిబిరం

కశింకోట: మండలంలోని నూతల గుంటపాలెం సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యు.రమేష్ తెలిపారు. ఉదయం 9 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ప్రత్యేక వైద్యులు, స్థానిక వైద్యులు, కంటి వైద్య నిపుణులు హాజరై రోగులను పరీక్షించి అవసరమైన వారికి రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని నూతలగుంటపాలెంతోపాటు సచివాలయ పరిధిలోని ఏనుగుతుని, ఇతర గ్రామస్తులు వినియోగించుకోవాలని కోరారు.

వినాయక ఆలయ వార్షికోత్సవం రేపు

అనకాపల్లి: మండలంలోని శారదా నగర్ మొయిన్ రోడ్డులో గల వినాయక ఆలయ 41వ వార్షికోత్సవం ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి బీశెట్టి జగన్, గ్రామ సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఆలయ ఆవరణలో వినాయకుడికి ప్రత్యేక పూజలు, గణపతి హోమం వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, రాత్రికి నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహిస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు చెప్పారు.

కన్యకాపరమేశ్వరికి విశేష పూజలు


1008 గాజులతో అమ్మవారికి పూజ

అనకాపల్లి: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం 1,008 గాజులతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు కమల శర్మ అమ్మవారికి సహస్ర నామార్చన, నిత్యార్చన, కుంకుమార్చనలు వంటి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బీశపాటి కృష్ణమోహన్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 5,746 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,600	4,600
మొదటి రకం	3,630	4,290
రెండో రకం	3,400	3,860
మూడోరకం	3,280	3,440

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
నాగద్వీపం (తెలుగు)	: సత్యనారాయణస్క్రీన్-1
మేడెన్ వెబ్(2షోలు)	: సత్యనారాయణస్క్రీన్-2
యాత్ర-2	: షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన	: పర్తిసాయి
ఓయ్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 68 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-20 యూనిట్లు, బీ పాజిటివ్-29 యూనిట్లు, ఓ పాజిటివ్-17 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 429 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 379 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరు ద్వారా సంప్రదించవచ్చు.

వలంటీర్ల సేవలు అమోఘం



సేవా వజ్ర, సేవా రత్న అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న మలసాల భరత్‌కుమార్, కార్పొరేటర్లు

- వైఎస్సార్‌సీపీ 'అనకాపల్లి' సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్
- సేవా అవార్డు గ్రహీతలకు సత్కారం


వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు పారదర్శకంగా అందజేస్తున్న వలంటీర్ వ్యవస్థ ఎంతో గొప్పదని, వలంటీర్ల సేవలు అమోఘమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కొనియాడారు. ఏటా ఉగాది రోజున వలంటీర్లను సేవా అవార్డులతో సత్కరిస్తున్నారని, ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వం ముందుగా సత్కరించిందని తెలిపారు. స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా వలంటీర్లు కృషి చేయాలని కోరారు. 80, 82, 83 వార్డుల కార్పొరేటర్లు కొణతాల నీలిమ, మందపాటి జానకీరామరాజు, జాజుల ప్రసన్నలక్ష్మీలు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ఎటువంటి అవనీతి జరగకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమచేసే విధంగా చేసిన కృషి అభినందనీయమన్నారు. ప్రతి నెలా 1 నుంచి 5 తేదీల్లో పింఛన్లు పంపిణీ చేస్తూ, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పెన్షన్లు అందజేస్తున్న ఘనత వలంటీర్లకే దక్కిందన్నారు. కరోనా వంటి విపత్తుల సమయంలో వలంటీర్లు చేసిన సేవలను వారు కొనియాడారు. అనంతరం జోన్ పరిధిలో సేవా వజ్ర, సేవా రత్న అవార్డులకు ఎంపికైన వలంటీర్లను భరత్‌కుమార్, కార్పొరేటర్లు శాలువాలతో సత్కరించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ ఒమ్మి అయ్యప్పనాయుడు, జీవీఎంసీ ఏపీడీ వికె.దొర, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి దాడి నారాయణరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-1 ఉగ్గిన అప్పారావు, 84వ వార్డు పార్టీ ఇన్‌ఛార్జి కోరుకొండ రాఘవ, పార్టీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్లకు అభినందనలు

కశింకోట: గ్రామ వలంటీర్ల సేవలు ఎంతో విలువైనవని ఎంపీపీ కలగా లక్ష్మి అభినందించారు. కశింకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండల స్థాయిలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా వజ్ర కన్నూరు యయున, దుంగ శ్రీవిద్య, సేవా రత్న సూరిశెట్టి కిషోర్, కుంచంగి అప్పలస్వామినాయుడు, నక్కా పార్వతి, సేవా మిత్రలను జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజుతో కలిసి ఆమె దుశ్శాలువాలు కప్పి, పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచిపేరు ప్రతిష్టలు తెచ్చేందుకు వలంటీర్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తమ సేవలను ప్రజలను మరింతగా అందజేసి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి దోహదపడాలన్నారు. దంతులూరి శ్రీధర్ రాజు మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సేవా వజ్ర, రత్న పురస్కారాలు పొందిన కొత్తపల్లికి చెందిన దుంగ శ్రీవిద్య, చింతలపాలెం వలంటీర్ కుంచంగి అప్పలస్వామినాయుడు మాట్లాడుతూ తమ సేవలకు గుర్తింపుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవార్డులు అందివ్వడం ఎంతో ఆనందదాయకమన్నారు. సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఎంపీడీవో కె.శేషుబాబు, పంచాయతీ కార్యదర్శులు కె.రమేష్, బి.చిన్నోడు, వైఎస్సార్‌సీపీ నాయకులు లగిశెట్టి గణేష్, నమ్మి గణేష్, గోకివాడ గోవింద, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


కశింకోటలో సేవా రత్న పురస్కార గ్రహీతలు కిషోర్, అప్పలస్వామినాయుడు, పార్వతిలను సత్కరిస్తున్న నాయకులు


కశింకోటలో సేవా వజ్ర పురస్కార గ్రహీతలు యమున, శ్రీవిద్యను సత్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మి

మేలుజాతి పశువుల పెంపకంపై దృష్టి సారించాలి


పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పశు సంవర్థక శాఖ జిల్లా అధికారి ప్రసాదరావు

మునగపాక : పల్లపు ఆనందపురంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్యశిబిరానికి రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. రిలయన్స్ ఫౌండేషన్, జిల్లా పశు సంవర్థకశాఖ సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని పశు సంవర్ధకశాఖ అధికారి ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలు జాతి పశువులను కొనుగోలు చేయడం ద్వారా పాల దిగుబడులు బాగుంటాయన్నారు. తద్వారా రైతులు ఆర్థికంగా నిలబడవచ్చన్నారు. అలాగే పశు పోషణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 25 పశువులకు గర్భకోశ పరీక్షలు, 20లేగ దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు, సర్పంచ్ కర్రి అప్పయమ్మ, అచ్యుతాపురం మండల సహాయక సంచాలకులు డాక్టర్ సునీల్‌కుమార్, వైద్యులు బానుబాబు, కోదండరావు, పద్మజ పాల్గొన్నారు.

స్థిరంగానే కూరగాయల ధరలు

కశింకోట: కశింకోటలోని వారపు సంతలో కూరగాయల ధరలు దాదాపు స్థిరంగానే ఉన్నాయి. కిలో ఉల్లిపాయలు, టమాటా, బంగాళాదుంపలు రూ.20, క్యాబేజీ రూ.30, బీట్రూట్, క్యారెట్, వంకాయ రూ.40, దొండకాయ రూ.50, కాకరకాయ, బీరకాయ, బెండకాయ, బరబాటి, చీమదుంప రూ.60, క్యాప్సికం రూ.80కు అమ్మకాలు సాగాయి.

మాఘ పౌర్ణమి జాతరకు ఏర్పాట్లు

- ముస్తాబైన ముత్యాలమ్మపాలెం తీరం
- పుణ్యస్నానాలు.. విశేష పూజలు
- స్టీల్ డిపో నుంచి 10 ప్రత్యేక బస్సులు


తీరంలో కొలువుదీరిన మాధవస్వామి

పరవాడ: మాఘపౌర్ణమి పూజలకు ముత్యాలమ్మపాలెం తీరం సిద్ధమైంది. శుక్రవారం వేలాదిగా తరలిరానున్న భక్తుల కోసం మాధవస్వామి ఆలయంతో పాటు తీరంలో విస్తృత ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ సూరాడ సోమునాయుడు చెప్పారు. మాధవస్వామికి శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇక్కడ పుణ్య స్నానాలు ఆచరించడానికి శుక్రవారం రాత్రి జాగరణ చేయడానికి విశాఖ, అనకాపల్లి, గవర్ల అనకాపల్లి, తోటాడ, వెంకటాపురం, పరవాడ, సబ్బవరం, పెదముషిడివాడ, లంకెలపాలెం, సాలాపువానిపాలెం, స్టీల్‌ప్లాంట్, ఎన్టీపీసీ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తీరానికి చేరుకుని రాత్రింతా జాగరణ చేసి శనివారం వేకువజామున తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తారు. స్నాన ఘట్టాల వద్ద మహిళలకు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తీర్థ మహోత్సవంలో భాగంగా ముత్యాలమ్మపాలెం కూడలి నుంచి తీరం వరకు రోడ్డుకు ఇరువైపులా రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణ చేశారు. మాధవస్వామి ఆలయాన్ని విద్యుత్ తోరణాలతో అలంకరించారు. జాగరణ చేసే భక్తుల కోసం ఉత్సవ కమిటీ శుక్రవారం రాత్రికి తప్పెటగుళ్లు, సాముగరిడీలు, తోడపెద్దులు, భజనలతో పాటు పల్సర్ బైక్ ఝూన్సీ కార్యక్రమం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని సోమునాయుడు చెప్పారు. మాఘపౌర్ణమి తీర్థమహోత్సవంలో పాల్గొనడానికి విచ్చేస్తున్న భక్తుల కోసం విశాఖ స్టీల్‌డిపో శుక్రవారం రాత్రి నుంచి ముత్యాలమ్మపాలెం వరకు 10 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపనున్నారు.

ప్రత్యేక పార్కింగ్

కార్లు, ద్విచక్ర వాహనాలను నిలిపేందుకు ముత్యమాంబ ఆలయం వద్ద ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 70 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. 20 మంది గజ ఈతగాళ్లను కూడా నియమించినట్టు పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

జాతరకు పకడ్బందీగా పోలీస్ బందోబస్తు


రేవుపోలవరం తీరంలో పర్యటిస్తున్న డీఎస్పీ వెంకట్రామయ్య తదితరులు

ఎస్.రాయవరం : రేవుపోలవరం తీరంలో ఈ నెల 24 న జరిగే మాఘ పౌర్ణమి జాతరకు పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలని నర్సీపట్నం డీఎస్పీ వెంకట్రామయ్య సూచించారు. రేవుపోలవరం తీరాన్ని గురువారం పరిశీలించారు. భక్తుల రద్దీ దృష్ట్యా అవసరమయిన సిబ్బందిని ప్రధాన ప్రదేశాల్లో పికెట్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముందురోజు రాత్రి నుంచి అవసరమైన పోలీస్ సిబ్బంది జాతర బందోబస్తు నిర్వహించడానికి సిద్ధంగా ఉంటారన్నారు. ప్రయివేటు వాహనాలు ఎక్కడ నుంచి ఎంతవరకు ప్రయాణించాలనేది ముందు తెలియపరిచి నియంత్రించాలన్నారు. ద్విచక్ర, వీఐపీ పార్కింగ్ కేటాయించాలన్నారు. సముద్రంలో స్నానానికి దిగేవారికి రక్షణకు గజ ఈత గాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. జేబు దొంగల బెడద ఉండకుండా సిబ్బంది చూడాలన్నారు. ఆయన వెంట నక్కపల్లి సీఐ అప్పన్న, ఎస్‌ఐ విభీషణరావు తదితరులు ఉన్నారు.

వైభవంగా గాదాలమ్మ ఉత్సవం

పరవాడ: తానాం గ్రామంలో కొలువుదీరిన గాదాలమ్మ అమ్మవారి పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించి అనుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, గండి బాబ్జీ, పరవాడ మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ, సర్పంచ్ కన్నూరి దేవి దర్శించుకున్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

- ప్రారంభించనున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

అనకాపల్లి: పట్టణం, మండలంలో పలు అభివృద్ధి పనులను శుక్రవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతిలు ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవిందలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అక్కిరెడ్డిపాలెంలో రూ.25 లక్షలతో సచివాలయ భవనం, కోడూరులో రూ.23.84 లక్షలతో ఆర్‌బీకే, రూ.20.80 లక్షలతో హెల్త్ క్లినిక్, రూ.40 లక్షలతో సచివాలయం, సిహెచ్.ఎన్.అగ్రహారంలో రూ.40 లక్షలతో సచివాలయం, మార్టూరులో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.23.84 లక్షలతో ఆర్‌బీకే, రూ.14 లక్షలతో కమ్యూనిటీ హాల్, బవులవాడలో రూ.23.84 లక్షలతో ఆర్‌బీకే, రూ.20.80 లక్షలతో వెల్‌నెస్ సెంటర్, రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, రావుగోపాలరావు కాలనీలో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవనం, రూ.10 లక్షలతో అల్లిఖానుడుపాలెం – ఊడేరు సీసీ రోడ్డు, రూ.35 లక్షలతో తుమ్మపాల సచివాలయం, అంబేడ్కర్ కాలనీలో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవనం, రూ.18 లక్షలతో కమ్యూనిటీ హాల్, వెంకుపాలెం గ్రామం మీదుగా రూ.4 కోట్లతో తుమ్మపాల, సీతానగరం, ఏఎంఏఎల్ కళాశాల రహదారి, సీతానగరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రూ.36 లక్షలతో ప్రహరీ గోడ, కోడూరులో రూ.14 లక్షలతో సీసీ రోడ్డు, సంపతిపురంలో రూ.23.84 లక్షలతో ఆర్‌బీకే భవనం, కొత్తూరు-2లో రూ.20.80 లక్షలతో వెల్‌నెస్ సెంటర్ నిర్మించినట్లు వివరించారు. వీటితోపాటు పట్టణ పరిధిలో జలగల మదుం జంక్షన్, సుంకరమెట్ట జంక్షన్ వరకు రూ.2.58 కోట్లతో సెంట్రల్ లైటింగ్, రహదారి విస్తరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. 83వ వార్డు మిరియాల కాలనీలో సీఎస్ఆర్ నిధులు రూ.38 లక్షలతో నిర్మించిన బ్రిడ్జి, 82వ వార్డులోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఎంపీ నిధులు రూ.70 లక్షలతో నిర్మిస్తున్న బాలికల డార్మెట్రీ, శారదా నది ఒడ్డున రూ.59 లక్షలతో నిర్మించిన పార్కును వారు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ క్రీడా మైదానంలో జీవీఎంసీ నిధులు రూ.50 లక్షలతో నిర్మిస్తున్న వ్యాయామ శాల(జిమ్)కు శంకుస్థాపన చేయనున్నారన్నారు.

రక్తహీనతపై జాగ్రత్తలు అవసరం


విద్యార్థినితో ఫోలిక్ యాసిడ్ మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి రమేష్

కశింకోట: విద్యార్థులు రక్తహీనత రాకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్ సూచించారు. మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్‌లో గురువారం రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారణకు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు, పచ్చని ఆకుకూరలు తీసుకోవాలన్నారు. మునగాకు, చింతకూర, గోంగూర, తోటకూరల్లో ఐరన్ పుష్కలంగా లభిస్తుందని చెప్పారు. బెల్లం, ఉసిరి, ఎండుద్రాక్ష, మొలకెత్తిన పప్పు ధాన్యాలు తీసుకోవాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎంఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ రక్తహీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను విద్యార్థులు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులతో ఆ మాత్రలు మింగించారు. హెల్త్ అసిస్టెంట్ ఆర్‌వీవీ సత్యనారాయణ, హెచ్ఎం వై.విజయలక్ష్మి సుమన్, సైన్స్ టీచర్ వి.లక్ష్మీసుధ, హెల్త్ అంబాసిడర్ టీచర్లు కె.కిరణ్మయి, కె.రాధ, పి.సుజాత, వై.శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ కేఎస్ఆర్‌కేజీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


అసకపల్లి శివారు కుమ్మరికాలనీలో పొక్లెయిన్ సాయంతో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: మండలంలోని అసకపల్లి రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను గురువారం రెవెన్యూ అధికారులు పొక్లెయిన్ సాయంతో తొలగించారు. తహసీల్దార్ జె. చలమయ్య ఆదేశాల మేరకు ఆర్‌ఐ వీరయ్య, వీఆర్వో జయశ్రీ సిబ్బందితో కలసి అసకపల్లి శివారు ఎర్రవానిపాలెం సర్వే నెంబరు 1లో 3 షెడ్లను, నక్కవానిపాలెంలో ఒకటి, కుమ్మరి కాలనీలో ఒక పునాదిని తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్న సమయంలో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు తెరతీశారన్నారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిన వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆక్రమణ దారులపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

పల్లెల్లో తీర్థాల సందడి


కాపుశెట్టివానిపాలెంలో ప్రత్యేక అలంకరణలో మరిడిమాంబ అమ్మవారు


విజయరామరాజుపేటలో మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న ఈర్లె అనురాధ తదితరులు

- సందడిగా గ్రామదేవతల జాతరలు
- నాలుగు గ్రామాల్లో వైభవంగా మరిడిమాంబ పండగ

తుమ్మపాల: పల్లెల్లో తీర్థాల సందడి మొదలైంది. గ్రామ దేవతల పండగలతో అంతటా పండగ వాతావరణం నెలకొంటోంది. గ్రామాలకు, గ్రామ ప్రజలకు రక్షణనిచ్చే దేవతామూర్తులను ఆరాధించడంతో పాటు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా ఈ ఉత్సవాలను ఏటా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతి ముగిసిన వెంటనే ప్రతీ గ్రామంలోని రామాలయాల్లో రాముల వారి తీర్థాలను గ్రామస్తులు ఘనంగా జరుపుతున్నారు. అనంతరం ఆచారంగా వస్తున్న అమ్మవార్ల పండగలను కూడా ఏటా ఫిబ్రవరి నుంచి మార్చి నెలాఖరు వరకు వైభవంగా నిర్వహించి, కొత్త అమావాస్య, ఉగాది నాటికి పూర్తి చేస్తారు. ఈ ఏడాది కూడా మండలంలో, పట్టణంలో అతి వైభవంగా పండగలు జరుగుతున్నాయి.

జీవాలకు రక్షణనిచ్చే మరిడిమాంబ

గ్రామాల్లో ప్రజలతో పాటు పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ల వంటి జీవాలన్నింటిని అనారోగ్యం దరి చేరకుండా రక్షించే తల్లిగా మరిడిమాంబను గ్రామస్తులు పూజిస్తారు. ఏటా అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. అందరు ఆరోగ్యంగా ఉండాలని, జీవాలకు సంపూర్ణ ఆరోగ్యం అందించాలని ప్రార్థిస్తూ పూజిస్తారు. మండలంలోని దిబ్బపాలెం, బవులవాడ, కాపుశెట్టివానిపాలెం గ్రామాలతో పాటు పట్టణంలోని విజయరామరాజు పేట శ్రీ మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం వైభవంగా జరిగింది. ఆయా గ్రామాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాలు విద్యుత్‌కాంతులతో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. అమ్మవారి ఆలయం వద్ద వేకువజాము నుంచి సందడి మొదలైంది. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, పండ్లు సమర్పించి, మొక్కులు చెల్లించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

అమ్మవారి జాతర సందర్భంగా ఆయా గ్రామాల్లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


విద్యుద్దీప కాంతుల్లో ఆలయం

ఈ రెండు నెలలు పండగలే..

గ్రామాల్లో ఆయా కుటుంబాల ఇలవేల్పుగా కొలిచే శ్రీ మరిడిమాంబ, శ్రీ పరదేశిమాంబ, శ్రీ పోలిపల్లెమ్మ, శ్రీ నూకాంబిక అమ్మవార్ల పండగలు రానున్న రెండు నెలల పాటు గ్రామాల్లో సందడిగా జరగనున్నాయి. గ్రామపెద్దలు, ప్రజల సహాయ సహకారాలతో అమ్మవార్ల పండుగ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పండగల నిర్వహణకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, ఏర్పాట్లు చేస్తున్నారు.

నూకాంబిక హుండీ ఆదాయం లెక్కింపు


అమ్మవారి హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అనకాపల్లి: గవరపాలెం నూకాంబిక ఆలయ మండపంలో గురువారం జిల్లా ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్, ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారి హుండీ లెక్కించారు. 90 రోజులకుగాను రూ.26 లక్షల 64 వేల 970 నగదు, 200 మిల్లీగ్రాముల బంగారం, కేజీ 98 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ చెప్పారు.